గ్రామ క్షేమం కోసం జలాభిషేకం

బోరు నుంచి నీళ్లు తీసుకొస్తున్న చిన్నారులు

కెరమెరి, ఏప్రిల్ 12 : మండలంలోని పెద్ద సాకడ గ్రామానికి చెందిన చిన్నారులు బోరు నుంచి నీళ్లు తీసుకొచ్చి, శుక్రవారం దేవతలకు జలాభిషేకం చేశారు. యేటా చైత్ర మాసంలో 5 రోజుల పాటు బాలికలతో గ్రామంలోని అన్ని దేవతలకు జలాభిషేకం చేస్తూ, తాలింపు లేకుండా భోజనం చేయడం ఆచారంగా వస్తున్నది. 5వ రోజు గ్రామస్తులంతా ఆరు బయట అమ్మవారికి పూజలు చేసి, అక్కడే వంటలు వండి భోజనం చేస్తారు.

14న అంబేద్కర్ జయంతి



మాట్లాడుతున్న మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోసిక మనోజ్

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 12 : బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఈ నెల 14న ఘనంగా నిర్వహిస్తున్నామని మాల సంక్షేమ సంఘం నస్పూర్ అధ్యక్షుడు గోసిక మనోజ్ తెలిపారు. నస్పూర్‌లోని సుందరయ్యకాలనీ మాల సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్ వద్ద జెండా ఆవిష్కరణ, మధ్యాహ్నం పెట్రోల్ బంక్ ఎదురుగా అన్నదానం ఉంటుందని తెలిపారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు జవాజి నందయ్య, సురిమిల్ల కిరణ్, ఓలెపు రవి, ప్రధాన కార్యదర్శి దోనిపెల్లి శరణ్, ఆర్గనైజర్స్ పండుగ శ్రీనివాస్, పీక సతీశ్, ప్రచార కార్యదర్శి మునిమల్ల నవీన్, సభ్యులు దోనిపెల్లి లింగయ్య, అల్లగూరి కిరణ్, పీక శ్రావణ్, సురేందర్, మాసు మల్లేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తనయుడి చేతిలో తండ్రి హతం

రాయమల్లు (ఫైల్)

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 12 : సెల్ ఫోన్ విషయంలో తండ్రికొడుకు మధ్య జరిగిన గొడవలో తండ్రి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి రామకృష్ణాపూర్‌లో చోటుచేసుకున్నది. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపూర్ అల్లూరి సీతారామరాజు నగర్‌కు చెందిన బామండ్లపెల్లి రాయమల్లు (60) సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. అతడి రెండో భార్య కొడుకు రాకేశ్‌తో గురువారం రాత్రి సెల్‌ఫోన్ విషయంలో గొడవ జరిగింది. కొద్దిరోజులుగా రాయమల్లు ఫోన్‌ను రాకేశ్ ఉపయోగిస్తున్నాడు. మొబైల్ ఇవ్వాలని అడుగగా మాటా మాటా పెరిగి, ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అక్కడే ఉన్న రోకలిబండతో రాకేశ్ రాయమల్లు తలపై కొట్టాడు. తీవ్ర గాయాలవడంతో మంచిర్యాల దవాఖానకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందాడు. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వారసంతకు ఎండదెబ్బ

- వెలవెలబోతున్న తిర్యాణి అంగడి
- తగ్గిన క్రయవిక్రయాలు
- ఇబ్బందుల్లో అమ్మకందారులు, ప్రజలు

ప్రజలు లేక వెలవెలబోతున్న వారసంత

తిర్యాణి, ఏప్రిల్ 5 : తిర్యాణి మండల కేంద్రంలోని కుమ్రం భీం చౌరస్తాలో ప్రతీ శుక్రవారం జరిగే వారసంత ఎండ తీవ్రతకు వెలవెలబోతున్నది. ఆసిఫాబాద్, ఐబీ, తాండూర్, బెల్లంపల్లి, రెబ్బెన, కెరమెరి, జైనూర్, కాగజ్‌నగర్, మందమర్రి, సోమగూడెం తదితర దూర ప్రాంతాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వ్యాపారులు స్టాళ్లను ఏర్పాటు చేసుకొని సంత నిర్వహిస్తారు. కావాల్సిన నిత్యావసరాలన్నీ ఒకేచోట లభించడంతో పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఈ సంతకు వస్తుంటారు. ఇలా ఒకే రోజు లక్షల్లో వ్యాపారం జరుగుతుంది. ఈ సంతకు మండలంలోని అతి మారుమూల గ్రామాలైన మంగీ, కౌతగాం, గీసీగూడ, అర్జున్‌ల్‌ొద్ది, మొర్రిగూడ, సుంగాపూర్, మగర్ మోడీ కన్నెపల్లి, మాణిక్యాపూర్ తదితర గ్రామాల్లోని గిరిజనులు వస్తుంటారు. దీంతో పెద్ద జాతరను తలపించేలా జరుగుతుంది. రాత్రి 8:30 గంటల వరకు వ్యాపారం సాగుతుంది. కానీ కొన్ని వారాలుగా ఎండ తీవ్రతకు ప్రజలు సంతకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో సంత వెలవెలబోతున్నది. వ్యాపారులకు సైతం నిరాశే మిగులుతుంది. కేవలం 5 గంటల నుంచి మాత్రమే సంతకు వస్తుండడంతో కొద్ది మంది స్థానికులు, ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. కూరగాయలు, పండ్లు సకాలంలో విక్రయాలు కాకపోవడంతో ఎండలకు కుల్లిపోయి వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. విక్రయానికి తీసుకొచ్చిన సరుకులతో వేచిచూసి కొందరు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

సంతలో సౌకర్యాలు నిల్..

సంతలో సకర్యాలు లేక ఆయా గ్రామాల ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీటి సౌకర్యంలేదు. ఈ సంత మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో నిర్వహించడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కనీసం మరుగుదొడ్లు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందవుతున్నదని, కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు, వ్యాపారులు అధికారులను కోరుతున్నారు.

❖ నిరాశే మిగులుతున్నది..

ఎండలు ఉండడంతో ప్రజలు కూరగాయలతో పాటు రకరకాల వస్తువులను కొనుగోలు చేసేందుకు రావడంలేదు. మూడు నెలల క్రితం మంచిగా గిరాకీ ఉండేది. ఎంతో కష్టపడి బెల్లంపల్లి నుంచి తిర్యాణి సంతకు వస్తున్నం. రవాణా చార్జీలు, సరుకుల ఖర్చులు పోను అనుకున్న దానికంటే రాబడి ఎక్కువ వచ్చేది. ఇప్పుడు నిప్పుల కొలిమిలా ఎండలు ఉండడంతో రైతులు, వ్యవసాయానికి, గృహ అవసర వస్తువుల విక్రయాలు భారీగా తగ్గాయి. దీంతో పెట్టుబడులు రాక నిరాశే మిగులుతున్నది.

- టాగ్ శంకరయ్య, వ్యాపారి, బెల్లంపల్లి

❖ కనీస సౌకర్యాలు లేవు..

సంతకు ఎంతో దూరం నుంచి గిరిజనులు వస్తుంటారు. సంత ఏర్పాటులో ఉత్సాహం చూపినా కనీస సౌకర్యాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీరు, మరుగుదొడ్లు నిర్మించకపోవడంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. అధికారులు స్పందించి సంతకు కేటాయించిన స్థలం లోపల ఉండేలా చూడాలి. కనీస అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

- తొడసం భాస్కర్, తుడుదెబ్బ మండలాధ్యక్షుడు, తిర్యాణి

❖ బోసిపోతున్న సంత..

కొన్ని వారాలుగా ఎండలకు జనాలు సంతకు రావడానికి ఆసక్తి చూపడంలేదు. దీంతో సంత వెలవెలబోతున్నది. 5 గంటల సమయం నుంచి మాత్రమే రావడంతో కొద్ది మంది స్థానికులు, ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. నిప్పుల కొలిమిలా ఎండలు ఉండడంతో కూరగాయలు సైతం పాడై, కనీస ధర పలకడంలేదు. దీంతో పెట్టుబడులు సైతం ఎల్లడం లేదు. ఏదేమైనా ఈ ఎండల వల్ల అన్ని రకాల వ్యాపారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- అల్లం మల్లక్క, కూరగాయల నిర్వాహకురాలు, తిర్యాణి

ఫూలే విగ్రహ ఆవిష్కరణ

బెల్లంపల్లి, ఏప్రిల్ 12 : మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహాన్ని పట్టణంలోని శాంతిఖని గని ఆవరణలో సింగరేణి బీసీ ఎంప్లాయీస్ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఆ సంఘం అడ్వైజర్ చిలుక శ్రీనివాస్, సంఘం ప్రతినిధులతో హాజరయ్యారు. నాయకులు ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధి మధూకర్, శాంతిఖని గని సంఘం గౌరవాధ్యక్షుడు రాజు, అధ్యక్షుడు వెంకటేశ్, ఉపాధ్యక్షుడు డీ రమేశ్, కోశాధికారి కే రమేశ్, నాగవర్ధన్, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు విజయప్రసాద్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ దాసరి తిరుపతిగౌడ్, నాయకులు దాసరి శ్రీనివాస్, రాజనాల రమేశ్, సిద్ధంశెట్టి సాజన్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఫూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి హామీ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 12 : సింగరేణి యాజమాన్యంతో జరిగిన సీపీఆర్ఎంఎస్(మెడికల్‌కార్డు) ట్రస్ట్ బోర్డు సమావేశంలో కార్మికులకు సంబంధించి మరిన్ని జబ్బులను సేవలోకి చేర్చేందుకు బోర్డు అంగీకరించిందని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. కొత్తగడెంలో సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డు సమావేశంలో జరిగిన ఒప్పందాలు, హామీలను వివరించారు. చర్చల్లో డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (పా) కే బసవయ్య, జీఎం వెల్ఫేర్ అధికారులు గుర్తింపు కార్మిక సంఘం ప్రతినిధులతో చర్చలు జరిగాయిని తెలిపారు. సీపీఆర్ఎంఎస్ విలువ రూ.8 లక్షల దాటినప్పటికీ అదనపు బిల్లు యాజమాన్యం భరించాలని కోరగా, ట్రస్ట్ అంగీకరించిందని పేర్కొన్నారు. పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లక్షెట్టిపేట, ఏప్రిల్ 12 : లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మూడు మండలాల్లో అత్యవసర మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ ప్రభాకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ అత్యవసర మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్, ఏప్రిల్ 12 : కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పట్టణ ఇన్‌చార్జి ఏఈ శ్రీనివాస్ ఒక ప్రటనలో తెలిపారు. నెలవారీ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాండూర్‌లో..

తాండూర్, ఏప్రిల్ 12 : తాండూర్ మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని ఆ శాఖ ఏఈ బీ ప్రభాకర్ తెలిపారు. బోయపల్లి, చౌటపల్లి, ఐబీ, మాదారం, రేపల్లెవాడ, అబ్బాపూర్, బెజ్జాల్ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మందమర్రిలో..

మందమర్రి రూరల్, ఏప్రిల్ 12 : మండలంలోని పాల చెట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ మరమ్మతుల పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని క్యాతనపల్లి ఏఈ జయకృష్ణ తెలిపారు. సారంగపల్లి, శంకరపల్లి చీర్లాకుంట, ఆదిల్‌పేట్, పొన్నారం, వెంకటాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం

లక్షెట్టిపేట, ఏప్రిల్ 12 : లక్షెట్టిపేట మండలం కొమ్ముగూడెం గ్రామ జాతీయ మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోడి చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా కోడి రత్నయ్య, జై భీమ్ సైనిక్ దళ్ అధ్యక్షుడిగా కోడి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా అజయ్, బొల్లం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మాల మహానాడు మండలాధ్యక్షుడు గరిసె రవీందర్, ప్రధానకార్యదర్శి బైరం లింగన్న, అలుగునూరి నరేశ్ సమక్షంలో ఎన్నుకున్నారు.

గురుకులాల్లో నైట్ డ్యూటీ రద్దు చేయాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 12 : గురుకుల విద్యాలయాల్లో ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీలు రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటూకూరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో వారానికి రెండు రోజులు నైట్ డ్యూటీలు చేసేవారని, ఇటీవలే వారానికి నాలుగు రోజులు నైట్ డ్యూటీలు నిర్వహించాలని సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి వెల్లడించారని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల బోధనపై ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించాలంటే ఉపాధ్యాయులకు రాత్రి పూట డ్యూటీలు పెంచడం సరికాదని, విద్యార్థులకు మానసిక విద్యావేత్తలతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. సంగీతం, ఆటలు, ఫీల్డ్ ట్రిప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, రాత్రిపూట విద్యార్థుల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

కారు ఢీకొని ఒకరు మృతి

రెబ్బెన, ఏప్రిల్ 12 : రెబ్బెన మండలం ఇందిరానగర్ గ్రామంలోని అంతర్రాష్ట్ర రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్గం చిన్నయ్య (40) మృతిచెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఇందిరానగర్‌కు చెందిన చిన్నయ్య, డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పని నిమిత్తం రెబ్బెనకు వెళ్లి, తిరిగి వస్తున్నాడు. ఇందిరానగర్‌లోని హైవే దాటుతుండగా కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు నుంచి రెబ్బెన వైపు వెళ్తున్న కారు వేగంగావచ్చి చిన్నయ్యను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయాలవడంతో రెబ్బెన హెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్య కోసం అక్కడి నుంచి బెల్లంపల్లి దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నయ్య భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమతి లేని సాపు సీజ్

బెజ్జూర్, ఏప్రిల్ 12 : బెజ్జూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దుకాణాల సముదాయాల్లో అనుమతి లేకుండా కొత్తగా తెరిచిన షాపును కార్యదర్శి తుకారాం సీజ్ చేశారు. షాపు నడిపించేందుకు పంచాయతీ అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షాపును సీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కారోబార్ వసంత్. సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు

తాండూర్, ఏప్రిల్ 12 : పారిశుధ్య పనుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని ఎంపీడీవో పీ శ్రీనివాస్ సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యేకాధికారుల పాలనలో భాగంగా తాండూర్, రాజీవ్‌నగర్ పంచాయతీల పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పర్యవేక్షించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిత్యం వీధులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. మంచినీటి బోరు పంపులను ఎప్పటికప్పుడు పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పంచాయతీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యదర్శులు తపస్‌కుమార్, కల్పన, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో పీ శ్రీనివాస్

రెండు బైకుల ఢీ..ఇద్దరికి తీవ్రగాయాలు

జన్నారం, ఏప్రిల్ 12 : మండలంలోని ఇందన్‌పెల్లి సమీపంలో గల కడెం ప్రధా కాలువ వంతెనపై రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు అదనపు ఎస్ఐ మృత్యుంజయ్‌సర్కార్ తెలిపారు. కడెం మండలం బీర్ నంది గ్రామానికి చెందని పెంద్రం తిరుపతి, సుదర్శన్ పల్సర్ బైక్‌పై కొమ్ముగూడలో వివాహ వేడుకలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో దస్తురాబాద్ మండలం మల్లాపూర్‌కు చెందిన రాయి కంటి వినయ్, బీ నవీన్ బులెట్ బైక్‌పై ఇందన్‌పెల్లికి వస్తుండగా, రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. దీంతో తిరుపతి, సుదర్శన్‌కు తీవ్ర, వినయ్, నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

పట్టుబడిన రేషన్ బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు

రెబ్బెన, ఏప్రిల్ 12 : రెబ్బెన మండలం దేవులగూడ గ్రామంలోని ఒక షెడ్డులో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 104.25 క్వింటాళ్ల రేషన్ బియ్యం(పీడీఎస్ రైస్)ను పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్యామ్‌లాల్, శ్రీనివాస్ తెలిపారు. వివిధ గ్రామాల కార్డుదారుల నుంచి అక్రమంగా కొనుగోలు చేసి, మహారాష్ట్ర తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యం పట్టుకొని, 6ఏ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న బియ్యం సేఫ్ కస్టడీ నిమిత్తం ఎంఎల్ఎస్ పాయింట్ ఆసిఫాబాద్‌కు అప్పగించినట్లు తెలిపారు.

కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఆశ్రమ విద్యార్థికి సీటు



పవన్ కుమార్

కాసిపేట, ఏప్రిల్ 12 : కాసిపేట మండలంలోని మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థి మోదితే పవన్ కుమార్ కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో సీటు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం నరసింహ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న అత్యత్తుమ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు నిర్వహించిన రెండో ఫేస్ పరీక్షలలో పవన్ కుమార్ (పదో తరగతి) గిరిజన విద్యార్థి ఉత్తీర్ణత సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో సీట్ సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి

కౌటాల, ఏప్రిల్ 12 : తలోడి గ్రామానికి చెందిన నక్క నంద కిషోర్ (38) గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మధూకర్ తెలిపారు. నందకిషోర్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇదే తరుణంలో గురువారం రాత్రి అతిగా మద్యం తాగివచ్చాడు. తాగుడు మానేయాలని భార్య వరలక్ష్మి వారించింది. రాత్రి అందరూ పడుకున్న తరావత అర్ధరాత్రి 2 గంటల సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గ్రహించిన భార్య, కుటుంబ సభ్యులు సిర్పూర్(టీ) దవాఖాకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం

- కష్టపడి పనిచేస్తే బీఆర్ఎస్‌దే విజయం
- మాజీ మంత్రి జోగు రామన్న
- రుయ్యాడిలో కార్యకర్తలతో సమావేశం
- కారును గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- సమస్యలపై పోరాటం చేస్తా : ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

తాంసి(తలమడుగు), ఏప్రిల్ 12 : 'రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం' నినాదంతో ముందుకెళ్దామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో నిర్వహించిన మూడు మండలాల కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి పాల్గొన్నారు. జోగు రామన్న మాట్లాడుతూ గ్రామస్థాయిలో బీఆర్ఎస్ కమిటీలు కష్టపడి పని చేస్తే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు మనదేనన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి తప్పు చేశామని రైతులు బాధపడుతున్నారని తెలిపారు. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామని మాట తప్పారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్ సార్‌కు కానుకగా ఇద్దామన్నారు. 16న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్ పర్యటనకు వస్తున్నారని, కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యలపై పోరాటం చేస్తా : ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని సమస్యలపై పోరాటం చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పేర్కొన్నారు. అధినేత కేసీఆర్ ఆశీర్వదించి ఎంపీ అభ్యర్థిగా ఇక్కడికి పంపించారని, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, జిల్లా నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, ఓయూ జేఏసీ నాయకులు ఎల్చల దత్తు, రవికాంత్ యాదవ్, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, అభిరాం రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రత్న ప్రకాశ్, తొమ్మిది మండలాల పార్టీ కన్వీనర్లు, జడ్పీటీసీ సుధాకర్, ఎంపీటీసీలు, మహేందర్, కిరణ్, వడూర్ సంజీవ్ రెడ్డి, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీని నిలబెట్టింది కార్యకర్తలే

- మంత్రి శ్రీధర్‌బాబు
- బెల్లంపల్లిలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశం

మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

బెల్లంపల్లి రూరల్, ఏప్రిల్ 12 : కష్టాల్లో ఉన్న కాంగ్రెస్‌ను నిలబెట్టింది కార్యకర్తలేనని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాల ఆర్పీ గార్డెన్స్‌లో శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అధ్యక్షతన పెద్దపల్లి నియోజకవర్గ పార్టీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల పాలనలో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లికి తాగునీరందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు పదేళ్ల కాలంలో యువతకు ఉద్యోగాలు కల్పించకుండా మోదీ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ఈ సమావేశంలో రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ ఠాకూర్, విజయరమణారావు, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, నాయకులు జనక్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, బెల్లంపల్లి మున్సిపల్ అధ్యక్షురాలు జక్కుల శ్వేత, మాజీ మున్సిపల్ చైర్మన్ మత్తమారి సూరిబాబు, నియోజకవర్గ నాయకులు నాథరిస్వామి, ముడిమడుగుల మహేందర్, చిలుముల శంకర్, పున్నం చందు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, సీనియర్ నాయకులు మునిమంద రమేశ్, కంకటి శ్రీనివాస్, చిప్ప మనోహర్, కన్నెపల్లి, వేమనపల్లి మండల నాయకులు ఎంవీ నర్సింగరావు, రుద్ర భట్ల సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మహిళా నాయకురాళ్ల గద్దల హైమవతి, రొడ్డ శారద, కంకణాల పద్మారెడ్డి, చొప్పదండి దుర్గాభవాని, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటుంది

- మందమర్రి ఏరియా జీఎం మనోహర్

బహుమతులు అందజేస్తున్న మందమర్రి ఏరియా జీఎం మనోహర్

మందమర్రి, ఏప్రిల్ 12 : క్రీడాభివృద్ధికి సింగరేణి సంస్థ ఎల్లపుడూ ముందుంటుందని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అన్నారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో శుక్రవారం ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్